# కొత్త సామెత

కర్నూలులో బస్సు ఆగుతూంటే శ్రీనివాస్ మనసు ఆనందంతో గంతులేసింది. మూడు సంవత్సరాల తర్వాత ఈ కందనవోలుకు చూడ్డానికి రాగలిగాడు.

శ్రీనివాస్ ఒక వ్యక్తి కోసం ఆత్రంగా చూశాడు.

అతని జాడ ఎక్కడా కనపడలేదు.నిరాశ నిస్పృహ ఆవరించాయి అతన్ని.

కర్నూలులో ఒక రోజు ఆగుదామనుకుంది కేవలం చక్రపాణికోసమే! మిత్రులు చాలామంది వున్నా ఎందుకో మిగతా వాళ్ళను కలవకపోయినా ఫర్వాలేదనిపిస్తుంది.

సూట్‌కేసు తీసుకుని కిందకు దిగాడు శ్రీనివాస్. బరువుగా కాళ్ళీడ్చుకుంటూ బస్టాండు బయటకొచ్చాడు.

రిక్షావాళ్ళకు, ఆటోవాళ్ళకు అతని రాక ఆనందాన్ని కలిగించింది. నలుగురైదుగురు అతన్ని సమీపించారు.

"ఆటో-ఆటో?"

"రిక్షా కావాలా బాబూ?"

ఎక్కడికి వెళ్ళాలన్నది శ్రీనివాస్‌కు ప్రశ్నార్థకమైంది. తను చక్రపాణిని బస్టాండుకు రమ్మని రాశాడు. లాడ్జిలో దిగి అతన్ని కలవాలా? లేక నేరుగా వెళ్ళాలా?

"లాడ్జి కావాలా బాబు?"

రిక్షావాళ్ళు, ఆటోవాళ్ళు ఎక్కడ సైకాలజీ చదువుకుంటారో అర్థంకాదు- ప్రయాణీకుల్ని ఇట్టే పట్టేస్తారు.

"సార్! ఇక్కడున్నారా? మీ కోసం లోపలంతా గాలించి వస్తున్నా" ,ఉలిక్కిపడ్డాడు వెనకనించి వినిపించిన మాటలకి.

చక్రపాణి!

"హలో చక్రపాణి! బాగున్నావా?"

"ఆ!రండి...సూట్‌కేసు బరువుందా?బరువు లేకపోతే నా స్కూటర్ మీద వెళ్ళిపోదాం మా ఇంటికి'.'

"మోయగలను. కానీ ఎందుకోయ్ శ్రమ? లాడ్జీ తీసుకుంటాను" మొహమాట పడ్డాడు శ్రీనివాస్.

"వ్వాట్! నేనిక్కడుండి కూడా మిమ్మల్ని లాడ్జికే పోనిస్తాననుకున్నారా? పదండి ఇంటికి పోదాం". మరో మాటకు తావులేకుండా సూట్‌కేసు లాక్కుని ముందుకు నడిచాడు.

స్కూటర్ ఎక్కి అతని వెనకాల కూచున్నాడు శ్రీనివాస్. సూట్‌కేసు బరువుగా వుంది కాబట్టి ఇద్దరి మధ్యా పెట్టమనిచెప్పి చక్రపాణి ముందుకు జరిగి స్కూటర్ డ్రైవ్ చేశాడు.

అతని ఇల్లు చూసి శ్రీనివాస్ ఆశ్చర్యపోయాడు. మరీ పెద్ద ఇల్లు కాకపోయినా చాలా అందంగా కట్టబడి వుంది.

"మీ ఉత్తరం అందిన దగ్గరనుండి మా వారు నేల మీద నడవడం మానేశారంటే నమ్మండి" ఓ బాపు బొమ్మ చేతులు జోడిస్తూ మంద్రంగా నవ్వు తూ చెప్పింది.

"పావని...నా భార్య" చెప్పాడు చక్రపాణి.

"స్నానం చేస్తే... కాఫీ టిఫినూ రెడీ".

"సార్! బోల్డుసేపు కబుర్లు చెప్పుకోవచ్చు. మీరు తయారైతే" చక్రపాణి శ్రీనివాస్‌కు

గది చూపించాడు.

చాలా బాగుంది.

ప్రత్యేకంగా అతిథులకు ఓ గది చక్రపాణి కేటాయించగలడని అతనెప్పుడూ అనుకోలేదు.

డైనింగ్ టేబుల్ దగ్గర అర్థమై పోయింది చక్రపాణి ఎంత అదృష్టవంతుడో!

వేడి వేడి పూరీలు... బంగాళదుంప ఉల్లిపాయలు ఉడకపెట్టి చేసిన కూర-అద్భుతం. కొసరి కొసరి వడ్డించే పావని. వద్దు అనలేకపోయాడు శ్రీనివాస్. తన జీవితంలో మొదటిసారి పూరీలు తింటున్నట్టు ఆబగా లాగించేశాడు ఓ ఆరుపైన- మరీ మరీ కూర వేయించుకుని.

కాఫీ తాగుతున్నప్పుడు అనిపించింది స్వర్గానికి బెత్తెడు దూరంలో వున్నట్టు.

"మాష్టారూ ఈ మధ్య మీ కథలు పత్రికల్లో కనపడ్డం లేదు", పావని అడిగింది.

"కొంపదీసి ఈ పిచ్చి... ఐ మీన్-మ్యాగజైన్లు తెగ చదివే పిచ్చి... చక్రపాణి మీకు అంటించాడా?" శ్రీనివాస్ అడిగాడు.

అతను నిశ్శబ్దంగా నవ్వుతున్నాడు.

"మరే! పెళ్ళయ్యేదాకా తెలుగులో ఇన్ని పత్రికలు వస్తున్నాయని నాకు తెలీదు." పావని సిగ్గుపడుతూ చెప్పింది.

"వాళ్ళింట్లో ఒకటీ కొనరుట! తీసుకురారట. పెళ్ళయిన కొత్తల్లోనే అద్దెకు తెచ్చినా-కొనుక్కొచ్చినా తెగగునిసేది. ఇప్పుడు...తను పూర్తి చేసేదాకా ఆ పత్రిక నా చేతికి రాదు" చక్రపాణి చెప్పాడు.

ఇద్దరూ చాలా ముచ్చటగా వున్నారు.ఈడు జోడు. పెళ్ళయి రెండు సంవత్సరాలైనట్టుంది ఏ బాదరబందీలు లేవు. పిల్లా పీచూ కూడా లేరు.

హాల్లో పేము కుర్చీలో సుఖాసీనులమైం తర్వాత చక్రపాణి అన్నాడు శ్రీనివాస్‌తో.

"మీరు తెలుగు పాఠకుల్ని అన్యాయం చేస్తున్నారు. చక్కటి కథ రాయగల నేర్పు వుంది. ప్రతి కథలో ఒక సందేశం చెప్పగలరు. అటువంటిది కథలు ఎందుకు రాయడంలేదు?"

శ్రీనివాస్ చప్పరించేశాడు.

"ఇప్పుడొస్తున్న సాహిత్యం చూస్తూంటే మనం ఏం రాస్తాంలే అనిపిస్తుంది. ఆ రోజులే వేరు. ఒకప్పుడు... దాదాపు ఇరవై సంవత్సరాల క్రిందట కథానికకు మంచి విలువ ఉండేది. మంచి చేవ ఉండేవాళ్ళు రాసేవాళ్ళు. పత్రికలు అప్పట్లో ఇన్ని లేవు. ఉన్నవి ఒకటి రెండు అద్భుతమైన కథల్ని ప్రచురించేవి. అవి చదివితే కడుపు నిండిపోయేది."

"మీలాంటి పాత రచయితలు ఇప్పుడు అలాంటి అద్భుతమైన కథలు రాయవచ్చుగదా?" పావని అమాయకంగా అడిగింది శ్రీనివాస్‌ను చూస్తూ.

"రాయచ్చు కానీ రాయాలన్న ఇన్స్‌పిరేషన్ రావటం లేదు. మంచి కథల్ని చదివి మెచ్చుకునే పాఠకులు ఎంతమందున్నారు? ఎంతసేపటికి ఏ బాయ్‌మీట్ గరల్‌లాంటి కథలు చదివేవాళ్ళే తప్ప మనిషి వెన్నుతట్టి లేపి మానవత్వాన్ని పెంపొందించే కథలు చదివేవాళ్ళే కరువై పోతున్నారు. అందుకే రాయబుద్ధి కావటం లేదు"

"అదేంకాదు కాని సార్...వాతావరణ కాలుష్య ప్రభావం మీలాంటివారిపైన కూడా పడుతున్నదని నా కనిపిస్తున్నది" చక్రపాణి నిర్మొహమాటంగా చెప్పాడు. శ్రీనివాస్ ఉలిక్కిపడ్డాడు.

"అవున్సార్! పత్రికలు వేసే కథలు తెగ చదివేసరికి అవే గొప్ప కథలని భ్రమకులోనవుతాం. ముఖ్యంగా మనం మన భాషలో సాహిత్యమే చదువుతూంటే కొన్ని కుహనా పత్రికలు

ఇచ్చేప్రచారాన్ని నమ్మి మన భాషలో వచ్చేటంత మంచి కథలు కానీ సీరియల్సుకానీ ప్రపంచంలో మరే ఇతర భాషలో రావట్లేదనుకుంటాం. కూపస్థమండూకంలా వుండిపోతాం" చక్రపాణి నిట్టూర్చాడు.

"కానీ మాష్టారులాంటి వాళ్ళకు అటువంటి భ్రమలుండవు. చూడగానే ఏది మంచి కథో, ఏది చెడ్డ కథో తెలిసిపోతుంది. అందుకని నేటి సాహిత్య ప్రభావం వీరిపైన పడకపోవచ్చు" పావని శ్రీనివాస్ చిన్న బుచ్చుకోవడం చూసి సమర్ధించింది.

"నో!నే ఒప్పుకోను. మనం పెద్ద నగరాల్లో వున్నామనుకోండి. అక్కడి ఫ్యాక్టరీ గొట్టాలనుండి వెలువడే విషవాయువుల్ని పీల్చుకుంటాం. మనకు తెలికుండానే అది మన ఆరోగ్యంపైన ప్రభావం చూపిస్తుంది",చక్రపాణి మొండిగా అన్నాడు." "ఓకే చక్రపాణి! నువ్వీ మధ్య కథలు రాస్తున్నావని ఎవరో అంటే విన్నాను.నిజమేనా?"

"ఏదో పిల్లచేష్టలు..." సిగ్గుపడ్డాడు.

"హనుమంతుడి ముందరా కుప్పిగంతులు"! పావని నవ్వేసింది అందంగా. "మీరీ ఊళ్ళో వున్నప్పుడు తనను కథలు రాయమని తెగ ప్రోత్సహించే వాళ్ళట. అప్పుడు రాయలేకపోయానని తెగబాధపడేవాళ్ళు".

"వెరీగుడ్! చక్రపాణి ఎనీ ప్రోగ్రెస్"! శ్రీనివాస్ అభినందిస్తూ అడిగాడు.

"ఏవోఅప్పుడప్పుడు కొన్ని పడుతూ ఉంటాయి".

"నేను చూడలేదే!అఫ్‌కోర్స్! నాఆఫీసు పని ఒత్తిడిలో ఈ మధ్య మ్యాగజైన్లు చదవడం లేదు"

"మీరు చదవతగ్గంత గొప్పగా ఏవీ లేవండి. మీ స్థాయితో పోలిస్తే నాలుగైదుమెట్లు కిందే వుంటాయి" సిగ్గుపడ్తూ చెప్పాడు చక్రపాణి.

శ్రీనివాస్‌కు గర్వంగా వుంది.

"ఎప్పటినుంచి రాస్తున్నవ్ మై డియర్ చక్రపాణి"

"అబ్బే! ఓ సంవత్సరం అవుతున్నదేమో".

"ఓ నాలుగన్నాపడ్డాయా", గుంభనంగా అడిగాడు.

చక్రపాణి తలూపాడు.

తరువాత సంభాషణ ఆఫీసు వ్యవహారాలమీదకు మళ్లింది. అలా గడిచిపోయింది ఉదయం.

మధ్యాహ్నం అద్భుతమైన భోజనం వడ్డించింది పావని. ఏ ఘరానా హోటల్‌కు తీసిపోని భోజనం! శ్రీనివాస్ కోసం ప్రత్యేకించి కొన్ని అయిటమ్స్ చేసింది. గులాబ్‌జామ్, ఫ్రూట్‌సలాడ్, చిప్స్, పాటోళి, సాంబారు,కొబ్బరిపచ్చడి.

నిద్ర కూరుకొస్తున్నది. రాత్రల్లా ప్రయాణం. బడలిక! నిద్రలేమి!సుష్టుగా భోజనం.

చక్రపాణి ఎంత అదృష్టవంతుడో శ్రీనివాస్‌కు అర్థమయిపోయింది.

అన్నీ వున్నా మొగాడికి అందమైన భార్య దొరకటం కష్టం. అందునా గుణవతి దొరకడం మరీ కష్టం. పై పెచ్చు నలభీమపాకాలు చేసిపెట్టే పనివంతురాలు దొరకడం మరీ మరీ కష్టం. "చక్రపాణి! కాస్త నడుం వాలుస్తాను. నీ ప్రింటయిన కథలు నా గదిలో పెడితే లేచిం తర్వాత చదువుతాను" ఆవులిస్తూ చెప్పి హంసతూలికాతల్పంలాంటి మంచంమీద నడుం వాల్చగానే శ్రీనివాస్‌కు తన ఒళ్ళు తనకు తెలియలేదు.

నిద్ర లేచేసరికి ఓ స్టూల్ పైన కాగితాల కట్ట కనిపించింది. వివిధ పత్రికలు...కొన్ని ఆదివారం అనుబంధాలు.

శ్రీనివాస్‌కు నవ్వొచ్చింది చక్రపాణి చాదస్తానికి. తను అతడి కథలు పడ్డ పత్రికలు పెట్టమన్నాడు ఇలా చెత్తంతా పెట్టమనలేదు.

అలవోకగా చూశాడు కొన్నింటిని. అన్నిటిలో చక్రి అన్న పేరు కనిపించింది కామన్‌గా. లెక్కేశాడు దాదాపు పాతికపైనే.

అదిరిపోయాడు! పాతిక కథలు! ఒక సంవత్సరంలో అదీ రాయడం మొదలెట్టిన సంవత్సరంలో బాపరే.

అయిష్టంగా కొన్ని చదవడానికి పూనుకొన్నాడు.కొన్ని కథలు చదువుతూంటే చక్రపాణే రాశాడా అని ఆశ్చర్యమేస్తున్నాయి.

చులకనగా చదవబోయిన శ్రీనివాస్ సీరియస్‌గా చదవసాగాడు.

"మాష్టారు...కాఫీ',' పావని పకోడిల ప్లేటుతో కాఫీ కెటిల్‌తో వచ్చింది.

"చక్రపాణి లేడా?'

"ఆయన ఫ్రండ్ వస్తే బయటికెళ్లారు. అరగంటలో వస్తానని మీకు చెప్పమన్నారు. ఈలోగా మిమ్మల్ని ఫలహారం చేసెయ్యమన్నారు".

"ఐసీ! పకోడిలు నాకు చాలా ఇష్టం". ప్లేటు అందుకుంటూ చెప్పాడు.

"ఆఁ!ఉల్లిపాయ పకోడిలు మీకు మరీ ఇష్టం",పావని అంది.

"ఎలా తెల్సు?"

"మీ కథలు చదివి ఆ మాత్రం అర్థం చేసుకోలేమా?"

"కాఫీ కప్పులో పోస్తున్నాను. తాగుతూ పకోడీ నంజుకోండి బాగుంటుంది" పావని సలహా ఇచ్చింది.

"థాంక్యూ"! పకోడి నోట్లో వేసుకుని కాఫీ సిప్ చేస్తూ ఏవో లోకాల్లోకి వెళ్ళిపోయాడు.

"మాష్టారు"! అన్న పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు.

"ఏమ్మా పావని! పిలిచావా?"

"కాదు- అరిచాను"

"ఏమైంది?"

"మిమ్మల్నిఅలాచూస్తూంటే...మీకేమైందోనననినాకుభయమేసింది""స్వర్గం వుందో లేదో కాని...మీ ఇల్లే నాకు స్వర్గం"

"మాష్టారు! మా వారి కథలు బాగున్నాయా?" పావని ఎంతో కుతూహలంగా అడిగింది.

"ఇన్ని పత్రికలు చదువుతావు నీకు తెలీదా?" ఎదురు ప్రశ్న వేశాడు.

"ఏమో! ఇతర రచయితలవి చెప్పచ్చు. ఏకథ గురించి ఆలోచించాలన్న మావారు రాశారని ఆత్మీయత...నన్ను ఆలోచించనీయడంలేదు. పైగా మీ లాంటి విమర్శకులు చెబితేనే తెలుస్తుంది" పావని మొహంలో అమాయకత్వం.

శ్రీనివాస్‌కు తన గత వైభవం గుర్తు కొచ్చింది. అతనిలోని విమర్శకుడు మేల్కొన్నాడు. రచయిత నిద్ర లేచాడు.

"పావనీ! కొన్ని కథలు రాయకుండా వుంటే బాగుండేది. ఉబుసుపోక కబుర్లు, కాలక్షేపపు బఠానీలు రాసి పాఠకుల్ని బోరు కొట్టించేకన్నా రాయకుండా నిగ్రహించుకుని మంచి రచయితన్న పేరు తెచ్చుకోవచ్చు".

"మాష్టారు! ఆయనకి రాసేది జాడ్యం అయిపోయింది. అది మిమ్మల్ని చూసే నేర్చుకున్నారు. ఇప్పుడు పొమ్మన్నా పోదు. వారానికి ఓ కథన్నా రాయకపోతే ఆయనకి పిచ్చెక్కిపోతున్నది".

ఎందుకని రాసి పాఠకులకి పిచ్చెక్కిస్తారు అని మనసులో అనుకున్నాడు శ్రీనివాస్.

"సారీ సార్! లేటయింది. కాఫీ తీసుకున్నారా?" చక్రపాణి చెమటలు కక్కుకుంటూ వచ్చాడు.

"బావుందోయ్! నువ్వు సాహిత్య వ్యవసాయం చేస్తున్నావ్. ఓ సంవత్సరంలో ఇన్ని కథలు రాయగలిగావంటే

ఐయామ్ ప్రౌడ్! నేనే ఎప్పుడూ రాయలేదు".

"నే రాయడం ఏముందిలెండి నా మొహం- అవి ప్రింట్ కావటం నాకాశ్చర్యం ఇప్పటికి"

"నాకూ ఆశ్చర్యమే. ఇన్ని వెరైటీ మ్యాగజైన్లలో రాయచ్చని నాకే అనిపించ లేదు".

"పావనీ! మాష్టారికి ఇంకోసారి కాఫీ ఇవ్వు".

"ఇప్పుడే తీసుకున్నా"

"కాఫీ మీ కిష్టం కదా! డికాషన్ రెడీగానే వుంచా" పావని లోపలికి వెళ్లింది.

"నువ్వు అదృష్టవంతుడివోయ్! చక్కటి భార్య-అందమైన ఇల్లు, పేరు ప్రతిష్టలు" అభినందించాడు శ్రీనివాస్.

"అంతా మీ ఆశీర్వాదం! మూడేళ్ళ కిందట మీతో చేసిన సంవత్సర స్నేహం నా జీవితాన్ని మార్చివేసింది. అందం కొరుక్కు తింటామాఅని కొందరంటారు-కానీ అది తప్పు..అందం ఆహ్లాదం ఇస్తుంది అని మీరనేవాళ్ళు...

అందుకే పెండ్లి ఆలస్యమైనా నిలబడి అందమైన భార్య కోసం అన్వేషించాను. నౌ ఐయామ్ హేపీ!

స్వంత ఇల్లు ఎలా వుండాలో మీరు చెబుతూ వుండేవాళ్ళు. బ్యాంకు లోను తీసుకుని మా అభిరుచికి అనుగుణంగా ఇల్లు కట్టించుకున్నాను. అందమైన ఇల్లు, భార్య సంసారం ఏర్పడ్డ తర్వాత నాలో వెలితి ఏర్పడింది. మీ కథలు చదువుతూంటే అర్థమయింది. అందుకే కలంపట్టాను. మీ అడుగుజాడల్లో నడుస్తున్నాను" వినమ్రంగా అన్నాడు చక్రపాణి.

పావని ట్రేలో మూడు కప్పులతో కాఫీ తెచ్చింది.

అచ్చం ఆమె కాఫీ దేవతలా కనిపించింది శ్రీనివాస్‌కు.

కాఫీ కప్పు పెదాలకు తగులుతూంటే స్వర్గం కనిపిస్తోంది.

"మాష్టారు, మా వారికి కొన్ని సూచన లివ్వండి. మంచి కథలు ఎలా రాయాలో నేర్పండి" పావని అర్థింపు.

నవ్వాడు శ్రీనివాస్.

"నేను చెప్పేదేమిటి? సంవత్సరానికి ఇన్ని కథలు రాస్తున్నాడు. నేను ఐదేళ్లల్లో కూడా రాసి వుండను. ఆయనే నాకు చెప్పాలి".

"సార్! నేను మీ ముందు చాలా చిన్నవాడ్ని. నిస్సంకోచంగా సలహాలివ్వండి"

"అవును మాష్టారు. మీరు చెబితే తెల్సుకోవాలనివుంది."

"ఓకే. తప్పో ఒప్పో ఒకటి చెప్పదలచుకున్నాను. మనసులో వచ్చిన ప్రతి ఆలోచనా కథగా రాయాలనుకోవటం తప్పు. ఆ థీమ్ వలన సమాజానికి ఏం మేలు జరుగుతుంది అని ఆలోచించాలి. రచయిత కొత్తగా రాస్తున్నప్పుడు తన పేరు అచ్చులో చూసుకోవాలని ఆతృతపడుతూంటాడు. అందుకోసం అడ్డమైన చెత్త రాస్తూ వుంటాడు. అది కంట్రోల్ చేసుకోవాలి".

"ఆలోచనల్ని ఫిల్టర్ చేసుకుని కొన్నిటినే కథలుగా రాయాలి. అప్పుడే రచయిత పాఠకుల హృదయాల్లో నిల్చిపోతాడు" శ్రీనివాస్ అన్నాడు.

చక్రపాణి మొహం నల్లబడింది.

పావని సంతోషంగా తలాడించింది.

'చక్రపాణి! బాధపడకు. రచయిత ఎదిగింతర్వాత తన తొలి నాటి కథల్ని చదువుకుని బాధపడకూడదు. నీకు రాసే సత్తా వుంది. మంచి ఇతివృత్తాలను ఎన్నుకుని మంచి కథలు రాయి. తొందరలో మంచి పేరు తెచ్చుకుంటావు"

ముగ్గూరూ డాబా మీద పచార్లు చేస్తున్నారు.

సూర్యుడు అస్తమిస్తున్నాడు. పశ్చిమాకాశం పసుపుపచ్చ రంగులో బంగారంలాగా మెరుస్తున్నది.

"చక్రపాణీ! అస్సలు రాయగానే ఏ కథనీ పోస్టు చేయకూడదు. దాన్ని డ్రాయరులో ఓ వారం పడెయ్యాలి. తర్వాత తీసి చదువుకోవాలి. అప్పుడు మనకు మనం చేసిన తప్పులు తెలుస్తాయి" శ్రీనివాస్ చెప్పాడు.

పావని, చక్రపాణి భక్తి శ్రద్ధలతో వింటున్నారు.

"తర్వాత కథల్లో-వైవిధ్యం పోతున్నదోయ్".

"ముఖ్యంగా మా వారి కథల్లో-ఎక్కువ ప్రేమ కథలే రాస్తున్నారు"పావని చెప్పాంది.

"అందుకు కారణం-తనే", చక్రపాణి అన్నాడు.

"ఒకసారి రాసిన థీమ్ ఇంకోసారి రాయకూడదు. పత్రికల్లో వస్తున్నప్పుడు రచయితని అంచనా వేయడం కష్టం.అతని కథలన్నీ ఒక పుస్తకరూపంలో వస్తే ఆ కథల్నీ చదివే పాఠకుడు రచయిత అంతరంగాన్ని తేలిగ్గా పసికట్టేస్తాడు. రచయుత లోపాలు తెల్సిపోతాయి. సబ్జెక్టుల్లో వెరైటీ లేకపోవడం-రాసిందే రాయడం బోర్ కొట్టిస్తాయి"

"శైలి మార్చమని చెప్పినా మార్చరు',' పావని చెప్పింది.

"శైలి కాదు శిల్పం-" చక్రపాణి సరి చేశాడు.

"శిల్పమో గిల్పమో తల్పమో నాకేం తెలుస్తుంది" అంది పావని.

"పేర్లు కూడా మార్చడం లేదు. నీకు వసంత పేరు చాలా ఇష్టం కదూ! అలాగే శ్రీహరి పేరు కూడా"చక్రపాణి తలూపాడు.

"కథల స్థాయి పెంచమని సలహా ఇవ్వండి" పావని అంది.

"అనుభవంలోకి వచ్చినవి రచయిత రాస్తాడు. నాకున్న ప్రపంచ అనుభవం చాలా తక్కువ" చక్రపాణి అన్నాడు.

"రవి కాంచనిచో కవి కాంచు" పావని అంది.

"అనుభవంతోనే కథ రాయలంటే మన జీవితం చాలదు. సమాజంలో జరుగుతున్నవి, నీతోటి వారి అనుభవాలు- అన్నీ కథలుగా ఉపయోగపడతాయి. గుండె లోతుల్లోకి వెళ్ళు. జీవితాల్ని కదిలించు" శ్రీనివాస్ అన్నాడు.

"ఇన్ని తెల్సి మీరీ మధ్య కథలు రాయడం మానేశారంటే నాకు బాధగా వుంది" చక్రపాణి చెప్పాడు.

"రాయక మీరు పాఠకులకు అన్యాయం చేశారు" పావని అంది.

నడుస్తున్న శ్రీనివాస్ దృష్టి చక్రపాణి ఇల్లు కాంపౌండువాల్ దాటి పక్క ప్లాటులో వున్న బావి మీద పడింది. ప్లాటు ఖాళీగానే వుంది. బావి మటుకు వుంది.

"చిత్రంగా వుంది. బావి తవ్వించారు. ఈ కాలంలో బావి ఎవరు వాడుతున్నారు."సార్! మా ఇల్లు కట్టడానికి ఆ బావి నీళ్ళు వాడుకున్నాము." "ఒకప్పుడు అంటే కొళాయిలు రాని ముందు ఆ బావి నీళ్ళు ఈ చుట్టుపక్కల వాళ్ళు తాగే వాళ్ళు. అమృతంలాగా వుండేవి"

పావని చెప్పింది.

"అంటే– ఇప్పుడు వాడ్డంలేదా?" శ్రీనివాస్ అడిగాడు.

"లేదు మాష్టారు. చూశారుగా ఆకులు,అలమలు, నాచూ బావి ఎలా పాడైపోయిందో ఇప్పుడు వాడ్డానికి పనికి రాకుండా పోయింది" పావని బాధపడింది.

"ఆశ్చర్యంగా వుంది. మంచి బావి ఉపయోగం లేకుండా వుంది. ఎలా పాడైంది."

"ఏముంది సార్! కొలాయిలొచ్చాయి. తిప్పితే నీళ్ళొస్తాయి. బావిలో అయితే చేదితే కాని నీళ్ళు రావు. అంత కష్టం ఎవరు పడతారు? అలా అంతా కొన్ని నెలలు నిర్లక్ష్యం చేసేసరికి బావి పనికి రాకుండా పోయింది. ఇప్పుడు నీళ్ళు కూడా ఎండిపోతున్నాయి. అప్పుడు ఎన్ని బిందెలు తోడినా నీరు ఊరుతూనే వుండేది. నాకు బాగా గుర్తు" చక్రపాణి చెప్పాడు శ్రీనివాస్ వంక చూస్తూ.

"ఫ్ఛ్! నేషనల్ వేస్టు! అంతే వాడుతూ వుంటేనే బావిలో నీరు ఊరుతూ వుండేది" శ్రీనివాస్ అన్నాడు.

"అంతే సార్! రాస్తూ వుంటేనే రచయితలో కొత్త కొత్త ఆలోచనలు వస్తూ వుండేది. బావిలో నీరు తోడడం ఆపేస్తే నీరు పాడైపోయినట్లు, రచయిత రాయడం ఆపేస్తే–కొన్నాళ్ళకి అతనికి రాసే శక్తి కూడా పోతుంది" చక్రపాణి మాటలకు శ్రీనివాస్ తుళ్ళిపడ్డాడు.

"మాష్టారూ! ఆడది తిరిగి చెడింది, మొగాడు తిరక్క చెడ్డాడు పాత సామెతలు- రచయిత రాయక చెడ్డాడు అన్నది కొత్త సామెత" పావని అన్న మాటలు శ్రీనివాస్‌లో నూతన ఉత్తేజం కలిగిస్తున్నాయి.

స్వాతి

